పాదయాత్రగా శబరిమలకు..



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మధుసూదన్‌రెడ్డి మొదటిసారి అయ్యప్పస్వామి మాలాధారణ చేశారు. ఆదివారం కాలినడకన శబరిమలకు బయలు దేరారు. ఈనెల ఆఖరులోపు శబరిమలకు చేరుకుంటానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురుస్వామి రాజేందర్‌గౌడ్‌తో పాటు సన్నిధానం స్వాములు వీడ్కోలు పలికారు. విజయవంతంగా శబరిమల పాదయాత్రను ముగించుకుని రావాలని వారు ఆకాంక్షించారు.

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఎల్లప్పుడు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే పార్టీ మారినా బీఆర్ఎస్ నాయకులు పార్టీ మారకపోవడం కేసీఆర్ చేసిన అభివృద్ధే అందుకు నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురువేయడం ఖాయమని ధీమా వ్యక్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రాజేంద్రనగర్ నుంచి కార్తీక్‌రెడ్డికి టికెట్ ఇస్తే మెజారిటీతో గెలిపించుకుంటామని వెంకటేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, రాజేష్, అరుణ్, రాఘవేందర్, కార్తీక్, భాస్కర్, పెంటమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.



దీపావళి శుభాకాంక్షలు

ధ్యానంతో మానసిక ప్రశాంతత



శంషాబాద్‌రూరల్: ధ్యానంతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సమకూరుతాయని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటి పరిధిలోని హుడా రింగ్‌టౌన్ కాలనీలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ రాజయోగం యోగా కేంద్రం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. కాసేపు ధ్యానం చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాల సాహిత్య పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో ప్రొఫెసర్ మృణాళిని తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాల సాహిత్య పరిషత్, మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో మాచిరాజు సీతారామయ్య-రత్నకుమారి దంపతుల స్మారక పురస్కారాలను ఆదివారం రవీంద్ర భారతిలో అందజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారస్కార గ్రహీత పత్తిపాక మోహన్, చొక్కాపు వెంకటరమణ ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ ప్రొపెసర్ మృణాళిని మాట్లాడుతూ..బాల సాహిత్య రంగానికి తమ జీవితాలను అంకితం చేసిన వ్యక్తులకు పురస్కారాలను అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతకు ముందు బడిపిల్లల కథల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేయగా సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బాల సాహితీవేత్త దాసరి వెంకటరమణ, రచయిత ఎస్.వేణుగోపాల్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కె.అనసూయ, సంస్థ వ్యవస్థాపకులు మాచిరాజు కామేశ్వర్‌రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పీస్ అండ్ మైత్రి కమిటీలను బలోపేతం చేస్తాం



నగర అదనపు పోలీస్ కమిషనర్‌తో గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు


గోల్కొండ: నగరంలోని పీస్ అండ్ మైత్రి కమిటీలను మరింత బలోపేతం చేస్తామని హైదరాబాద్ నగర లాండ్ ఆర్డర్ అదనపు కమిషనర్, నగర పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ విక్రమ్‌సింగ్ మాన్ అన్నారు. గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ ప్రతినిధులు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దీపావళి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, పోలీసులకు పీస్ కమిటీలు వారధిలా పని చేస్తున్నాయన్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు మైత్రి కమిటీ సభ్యులు వెలకట్టలేని సేవలు అందిస్తున్నారన్నారు. ఆయనను కలిసిన వారిలో గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ అధ్యక్షుడు ఆబీద్, ఇలియాస్ అక్బర్, తహసీన్ పాషా, నర్సింగ్‌రావు, ఆజామ్‌ఖాన్ తదితరులున్నారు.

డిజిటల్ డిస్‌ప్లేలతో వాహనదారులకు ఇబ్బందులు

డిస్‌ప్లేలను తొలగించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఎక్స్‌లో ట్వీట్



ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి ముందు మూవింగ్ డిజిటల్ డిస్‌ప్లే



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఎక్స్‌లో పోస్ట్ చేసిన వాహనదారుడు

బంజారాహిల్స్: అత్యంత వెలుతురుతో ప్రకటనలు వచ్చే ఈ డిజిటల్ డిస్‌ప్లేల వల్ల వాహనదారుల కళ్లల్లోకి నేరుగా లైటింగ్ రావడం వల్ల ప్రమాదాలు కూడా జరుగుతాయని, వాహనాలను నియంత్రించలేకపోతారని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మూవింగ్ డిస్‌ప్లేలు నిషేధించినా ఇంకా ఎందుకు వినియోగంలో ఉన్నాయంటూ ఓ వాహనదారుడు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఇటీవల ఎక్స్‌లో ట్వీట్ చేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి పాదచారుల వంతెనకు, ముఫకంజా కాలేజీ పాదచారుల వంతెనకు..ఇలా ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఏడు చోట్ల ఈ డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు. రాత్రిపూట అత్యంత కాంతివంతంగా ఇవి ఉండడంతో కళ్లల్లోకి వెలుతురు రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయంలో వాహనదారులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై ఇంతవరకు అధికారులు స్పందించలేదు. ఎన్నోసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు చేసినా ఏ ఒక్కరూ స్పందించకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూవింగ్ డిస్‌ప్లేలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్యలు వివరిస్తున్న సంఘం సభ్యులు

లిబర్టీ: రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆటో డ్రైవర్స్, క్యాబ్ డ్రైవర్స్ సమస్యలు పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అఖిల భారత ఉద్యోగుల అసంఘటిత కార్మికుల సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కౌశిల్ సమీర్ జన్మదినాన్ని పురస్కరించుకొని జరిగిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఉద్యోగ భద్రత జీవన ప్రమాణాలు పెంపు సామాజిక భద్రత ఈ అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు చెందాల్సిన అవసరం లేదని దశల వారిగా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. ఆటో కార్మికుల సమస్యలు, క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సమీర్, సంపత్‌రెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలి

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, హాజరైన అధికారులు, సిబ్బంది



బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. ఆదివారం హిమాయత్‌సాగర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంలో భాగంగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించామన్నారు. సూపర్‌వైజర్ ఆఫీసర్లు, ఎన్యుమరేటర్స్‌తో శిక్షణ కార్యక్రమం, డోర్ స్టికరింగ్, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అంశాలపై చర్చించామని అన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ సర్వేను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ యాదయ్య, మేనేజర్ మంజులత, టీఎంసీ శ్రీలత, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలి

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 26న సబ్ జూనియర్ జాతీయ స్థాయి మహిళా హాకీ టోర్నమెంట్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎల్బీస్టేడియంలోని ఫతే మైదాన్ క్లబ్‌లో అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీఆర్. బీమ్‌సింగ్, కోశాధికారి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణం లేకనే ఆ సంఘాన్ని వదిలేశా

ఏఐటీయూసీలో చేరిన వాణి రమావత్

కాచిగూడ: సీఐటీయూలో గత అనేక సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయిలో వివిధ హోదాలలో పని చేసిన నాయకురాలు వాణి రమావత్ ఏఐటీయూసీలో చేరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని ఆమెకు కండువా కప్పి ఏఐటీయూసీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణగూడలోని ఏఐటియూసీ కార్యాలయంలో వాణి రమావత్ మాట్లాడుతూ 2016 సంవత్సరం నుంచి సీఐటీయూలో అనేక ప్రజా సంఘాలలో ఎన్నో పోరాటాలలో పాల్గొన్నానని, కానీ సీఐటీయూలో కిందిస్థాయి నాయకుల ఎదుగుదల, వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత వాతావరణం లేనందువలన ఆ సంఘాన్ని వదిలివేసి 105 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీలో చేరినట్లు తెలిపారు. ప్రజా స్వామ్యబద్ధమైన ఐటీసీలో కార్మిక సమస్యల పరిష్కారం కోసం నావంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఎం.నరసింహ, కమతం యాదగిరి, పానుగంటి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దమస్కర్ చర్చి వార్షికోత్సవం

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని దమస్కర్ చర్చి 25వ వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చర్చి సౌతిండియా రాంకోట్ సంఘ కాపరి రెవరెండ్ టి.భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా దమస్కస్ చర్చి చైర్మన్ రెవరెండ్ పాల్ కరుణాకర్ భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చర్చికి విచ్చేసిన సభ్యులందరికీ సరోజిని కరుణాకర్ నూతన దుస్తులు అందజేశారు.

సెంట్రల్ వర్సిటీ ఎన్నికలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా

ఇండిపెండెంట్ అభ్యర్థి ఆకాష్ భాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకాష్ భాటి

పంజగుట్ట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం నాయకున్ని ఎన్నుకునేందుకు జరిగిన ఎన్నికల్లో ఎన్నో అవకతవకలు జరిగాయని దీనిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆకాష్ భాటి తెలిపారు. తన అపోజిషన్ పార్టీకి 28 చెల్లని ఓట్లు ఉన్నా వాటిని పరిగణలోకి తీసుకుని కేవలం 18 ఓట్ల తేడాతో తాను ఓడిపోయినట్లు ప్రకటించారని, ఎన్నికలకు అధికారులుగా వ్యవహరించిన కొంతమంది తన ప్రత్యర్థి పార్టీ వారికి వత్తాసు పలికారని అన్ని ఆధారాలతో తాను హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 26వ తేదీన ఎన్నికలు జరగగా 27వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగిందని అధ్యక్షుని బరిలో మొత్తం ఏడుగురు ఉండగా, ఎస్ఎఫ్ఐ, ఎఎస్ఏ, బీఎస్ఎఫ్, డీఎస్‌యూ నలుగురు కలిసి పోటీ చెయ్యగా వారికి 1313 ఓట్లు వచ్చాయని, ఇండిపెండెంట్ అభ్యర్థినైన తనకు 1295 ఓట్లు వచ్చినట్లు పేర్కొన్నారన్నారు. కానీ మొత్తం 30 బ్యాలెట్ పేపర్లపై రెండుసార్లు స్టాంప్ కొట్టారని వాటిని తొలగించాలని చెపితే దానికి వారు నిరాకరించి, తమ కౌంటింగ్ ఏజెంట్‌ను గదిలో వేసి బంధించి పోలింగ్ ఏజెంట్లు లేకుండానే రిజల్ట్ డిక్లేర్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రీకౌంటింగ్ జరపాలని ఎన్నికల అధికారికి, వీసీకి, ఉన్నతాధికారులు అందరికీ వినతి పత్రాలు ఇవ్వగా వారు ఈనెల 2వ తేదీన రీకౌంటింగ్ జరుపుతూ తిరిగి చెల్లని ఓట్లు కౌంట్ చేస్తున్నారన్నారు. అధికారులు కూడా వారికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే ఎన్నికల కమిటీని బయటివారిని నియమించి వారి ఆధ్వర్యంలో రీకౌంటింగ్ చెయ్యాలని బ్యాలెట్ పేపర్‌పై రెండు స్టాంపులు ఉన్న ఓట్లను పరిగణలోకి తీసుకోరాదని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో అభినవ్, సిద్దాంత్ పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు సంస్థల కృషి అభినందనీయం

రాష్ట్ర పూర్వ సలహాదారుడు కే.వీ.రమణాచారి



ఖైరతాబాద్: తెలుగు భాష పరిరక్షణకు జంటనగరాల్లోని వివిధ సంస్థలు కృషి చేయడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు కే.వీ.రమణాచారి అన్నారు. ఆదివారం యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, వంశీ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాల తొలి సమావేశాన్ని లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమణాచారి మాట్లాడుతూ యువభారతి చొరవతో అన్ని సంస్థలు కలిసి రావడం చేస్తే వృక్షాలన్ని ఒక చోటచేరి ఫల ప్రదానం చేస్తున్నట్లుందన్నారు. తెలుగు వెలుగు సమాఖ్య ప్రారంభం తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి శుభారంభమన్నారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేసిన కృషి మరువలేమన్నారు. అదే విధంగా తెలుగు వెలుగు సొగసు అనే అంశంపై ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వాహకులు సుధామ, తెలుగు సాహిత్యంలో ఆణిముత్యాల్లాంటి పద్యాలు అనే అంశంపై ప్రముఖ రంగస్థల సినీ నటుడు అక్కిరాజు సుందరరామకృష్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వంశీ ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షుడు వంశీరామరాజు, యువభారతి అధ్యక్షులు ఆచార్య ఫణీంద్ర, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, యువభారతి కార్యదర్శి జీడిగుంట, జీఎల్ దుర్గ, కిన్నెర సంస్థ అధ్యక్షులు మద్దాళి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో ఫిర్యాదుల వెల్లువ



వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

శాలిబండ: మీరాలం సబ్ డివిజన్ కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు అందినట్లు మీరాలం ఏడీఈ వెంకటేష్ గౌడ్ తెలిపారు. నాలుగు ఫిర్యాదుల్లో.. మూడు విద్యుత్ అంతరాయాలు, ఒకటి మీటర్ అధిక బిల్లింగ్ వస్తుందని ఫిర్యాదులు అందాయన్నారు. అధిక బిల్లుకు సంబంధించిన బిల్లు సవరణకు ఈఆర్‌ఓ కార్యాలయానికి ప్రపోజల్ పంపించి వారంల్లోపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ అంతరాయ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఏఈకి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చందులాల్ బారాదరి ఏఈ షబ్బీర్ అహ్మద్, అత్తాపూర్ ఏఈ సత్యనారాయణ, కిషన్‌బాగ్ ఇన్‌చార్జి ఏఈ శివ ప్రసాద్, మీరాలం సబ్ ఇంజనీర్ బుచ్చిరెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ కూలినా ఫిర్యాదు చేయలేదు!

కారు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయని జీహెచ్ఎంసీ అధికారులు



కూలిపోయిన ప్రహరీ, ఫెన్సింగ్

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కును ఆనుకుని జీహెచ్ఎంసీ వాక్‌వే ప్రహరీతో పాటు ఫెన్సింగ్‌తోను అదుపుతప్పిన ఓ కారు ఢీకొట్టడంతో ధ్వంసమైన సంఘటన విదితమే. అయితే రెండు రోజులక్రితం ఈ ఘటన జరగగా ఇంత వరకు జీహెచ్ఎంసీ సర్కిల్-18 అధికారులు చర్యలు తీసుకోలేదు. ఫుట్‌పాత్‌తో పాటు పార్కు ప్రహరీ గోడ, ఫెన్సింగ్ ధ్వంసమైన ఘటనకు కారకులైన వారిపై ఇంతవరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఈ ఘటనపై ఇంజినీర్లు స్పందించక పోగా, కూలిపోయిన గోడను, ఫెన్సింగ్‌ను ఇంకా నిర్మించ లేదు. దీంతో అసాంఘిక శక్తులు కూలిన గోడ ప్రాంతంలో లోనికి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం కూడా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ గోడ నిర్మించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

8న సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

రాజేంద్రనగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి



రాజేంద్రనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 8వ తేదీన పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... తలసీమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే వృద్ధులు, వికలాంగులకు పండ్లు పంపిణీ, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ శాఖ సబ్ డివిజన్ రాజేంద్రనగర్ సెక్షన్ కార్యాలయం వద్ద ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్ సెక్షన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సత్యనారాయణతో పాటు విద్యుత్ అధికారులు పాల్గొని వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించారు. రాజేంద్రనగర్ బుద్వేల్ గ్రామానికి చెందిన డి.శ్రీధర్ గ్రామంలో లో-వోల్టేజీ సమస్యపై ఫిర్యాదు చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ దేవాలయానికి శ్రీచక్రం బహూకరణ



శ్రీచక్రాన్ని సమర్పించి పూజలు నిర్వహిస్తున్న ఓరిగాల హరికిషన్, కల్పన కుటుంబ సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ టీచర్స్‌కాలనీలో కొలువై ఉన్న కట్ట మైసమ్మ దేవాలయానికి శ్రీచక్రాన్ని ఓరిగాల హరికిషన్, కల్పన కుటుంబ సభ్యులు బహూకరించారు. అమ్మవారి దేవాలయానికి శ్రీచక్రం బహూకరించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని హరికిషన్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోరని శ్యామ్, కోరని నరేందర్, టీచర్స్ సురేశ్, కోరని బాలు, పోతురాజు రామకృష్ణ, పి.నర్సింహ, ఫైటర్ శివ, కృష్ణంరాజు, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు కనిపించొద్దు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్లపై ఎక్కడా గుంతలు కనిపించొద్దని మణికొండ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని పంచవటికాలనీ ప్రవేశంద్వారంలో ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఇంజినీరింగ్ అధికారులు పర్యటించి ఎక్కడెక్కడ గుంతలు ఉన్నాయో పరిశీలించి వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. రాబోయే మున్సిపల్ సమావేశంలో రోడ్ల మరమ్మతులకు అధిక నిధులు కేటాయిస్తామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గన్‌ఫౌండ్రీ: ది జింజర్, గార్లిక్, పొటాటో మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ మేరకు ఆదివారం సిద్దిఅంబర్ బజార్‌లోని ఓ హోటల్‌లో నూతన కార్యవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎం.నరేందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా సురేష్ జార్జ్, కోశాధికారిగా డి.శశికాంత్, ఉపాధ్యక్షుడిగా డి.శివకుమార్ ఖలీం, జాయింట్ సెక్రెటరిగా గోపాల్‌యాదవ్, గౌరవ సలహాదారులుగా కె.రాధాకృష్ణ, ప్రవీణ్, సి.పరమేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా సైదా వలీ, బి.మల్లేష్, శేషాద్రి గౌడ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్‌గంజ్ ఎస్ఐ జగదీష్, బీజేవైఎం సెంట్రల్ జిల్లా కార్యదర్శి దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.